

# మొగుడూ పెళ్లాల ప్రేమకత

ఆర్.ఎమ్. ఉమామహేశ్వరరావు

సల్లంగ సవుద్రం మింద మబ్బు జూడు కమ్ముకోనొస్తా వుండాది. యింకొంచేపు తాలితే కుమ్మరించి పోసెయ్యబోతాది వాన. యింకిప్పుడేం బోతావుగానీ, మీ వొదిన రొయ్యిలు యేంచి పెట్టుండాది తినేసి గమ్మన పొణుకోబో. పొద్దున లేసిపోవచ్చు.''

మా అమ్మ యీ మాటలు నాతో అనడం యిది రెండోసారి. ఆమె మాటల్లో ధ్వనిస్తున్న విసుగు నా చెవిన బడినా యీసారి కూడా నేను జవాబివ్వలేదు. నేను దృష్టి నిలిపిన దృశ్యం చెదిరిపోతుందేమో అని నా భయం.

కిటికీ వెనుక కొబ్బరాకుమీద వాలిన మిడతను మింగడానికి మరబొమ్మలాగా కదులుతున్న తొండని చూస్తున్నాను. దాని ప్రతి కదలికలోనూ యెంతో మెలకువ కనిపిస్తోంది. అడుగు ముందుకు వేసిన ప్రతిసారీ నిశ్చలంగా నిలబడి పరిస్థితిని అంచనా వేసుకుంటోంది. తనని సమీపిస్తున్న తొండనే మిడత యేకాగ్రదృష్టితో చూస్తోంది. కదలదూ బెదరదు. అది ప్రమాదాన్ని పసిగట్టలేదా లేక దానిది ఆశ పెట్టినంతసేపు ఆశ పెట్టి ఆఖరి క్షణాన యెగిరిపోయే చతురమైన యెత్తుగడా?! తొండకీ బహుశా యిదే అనుమానం కలిగిందేమో అది యీసారి తలపైకీ కిందికీ వూపుతూ వేట తన వునికిని గుర్తించిందా లేదా అని పరీక్షిస్తోంది. మిడత మెదలకుండా వుంది. తొండ వేగంగా కొంత ముందుకు జరజరా పాకి నిలబడింది. యింక వొకే వొక్క అంగచాలు, మిడతను నోట కరచుకోవడానికి. మిడత మిడి గుడ్లేసుకుని తొండనే చూస్తూ వుంది. తొండ శరీరాన్ని వెనక్కి వంచింది. మిడతలో కదలిక లేదు. నా గుండె వేగం పెరిగింది. రెప్పవాల్చకుండా చూస్తున్నాను.

"ఆ అనవూ వూ అనవూ యేందట్ట మన్నార సామి యిగ్రహం మాదిరిగా నిలబడుకోనుండావు,'' అని మా అమ్మ కొనసాగించబోయింది. చూపును కొంచెమయినా పక్కకి తిప్పకుండానే చేతిసైగతో ఆమెను మాట్లాడద్దన్నట్టుగా వారించాను.

విల్లును వదిలిన బాణంలాగా తొండ మిడత మీదకి దూకింది. సరిగ్గా అదేక్షణంలో వినిపించిన వొక వెర్రి అరుపు తొండనీ నన్నూ కూడా కలవర పరిచింది. తొండ దబ్బున నేలమీద పడిపోయింది. మిడత తొండ నోటికి దొరికిపోయిందో లేక తప్పించుకుని ఎగిరిపోయిందో నాకు కనిపించలేదు.

గంగనా గోలగా అరుస్తూ వొక ఆడమనిషి రోడ్డవతల సాలలోంచి బయటకొచ్చి పడింది.

''వోయంవ్వో... కొట్టి సంపేస్తా వుండార్రా యమ్మో,'' యేడుపూ కోపమూ అసహాయతా కలగలిసిన బొంగురు గొంతు.

ఆమె లేచి నిలబడింది. చీరకి అంటిన యెర్ర దుమ్మును దులుపుకోలేదు. యెదమీద నుంచి జారిపోయిన పైటను పట్టించుకోలేదు. వూడిన జుట్టును మాత్రం ముడేసుకునింది. వొంగి రెండు పిడికిళ్లలోకి మట్టిని జవురుకునింది. చేతులు పైకెత్తి మట్టిని నేలకి జారవిడుస్తూ తిట్లు ప్రారంభించింది.

"నా బట్టా నీకు వాంతీ బేదీ తగల. నీ కాళ్లల్లో పుండుబడ. నిన్ను పెద్ద రోగం యెత్తకబోను. నిన్ను మశాణంలో బెట్ట. నిన్ను గోసి పోలేరమ్మకి పోగులు బెట్ట. తిని అరువుగా పొణుకోకుండా నా యెదాన బడి సంపతా వుండావు గదరా నా కొడకా...''

మా అమ్మ నా పక్కన వచ్చి నిలబడి కిటికీ లోంచి బయటకు చూస్తూ అనింది-

"దినమ్మా యిదే బాగోతం గదా యీ మొగుడూ పెళ్లాలది. పొగులూ రేత్రీ కష్టంజేసి కడుపుకింత పెడతా వుండాదే పిండాకూడు. తిని పడుంటే యేమి. సంపతా వుంటాడు యేబ్రాసి యెదవ."

"యీ రోజింకా లేదే అనుకుంటా వుండా, మొదు లైందా సినిమా ఆట," అంటూ వంటింట్లోంచి వస్తూ అనింది మా వదిన.

"యింతీదిలో వొక్క మొగోడూ లేడుగదా ఆ యెదవని నాలుగు తగిలించేదానికి. అప్పుడన్నా బుద్ధొచ్చును ఆ ముండమోపోడికి," మా అమ్మ మాటల నిండా అతనిపట్ల కోపం, అసహ్యం వున్నాయి.

"యెవురు బోతారు ఆ నోటికా. మొన్నొక దినం యిట్నే ఆ యమ్మని కొట్టి సంపతా వుంటే కళ్లజూళ్లేక అగ్గో - ఆ మునగ చెట్టుండే యింట్లో కొత్తగా చేరిన అయ్యోరు అడ్డాం బోయినాడా. అనేక జూడు కత. సందాల ఆ అయ్యోరింటి మిందకి బొయ్యి యేం కూతలు కూసినాడనీ! అయి మాటలా. ఆకిరికి ఆ యమ్మకీ అయ్యోరికీ సమందం గట్టి యీదిలోకి యీడ్చినాడే. యింకెవురు బోతారు ఆ యెదవ నోటికి! యెవురికి బట్టింది జలదారి గుంట్లో రాయేసేదానికి," అని మా వదిన యెంతో వుక్రోషంతో అనింది. ఆ మాట అనేసి ఆమె విసవిసా వంటింట్లోకి వెళ్లిపోయింది.

నేను వాకిట్లోకి నడిచి తిన్నెమీద కూర్చున్నాను.

"మూరుడు పొడుగు పొడుచుకోనొస్తా వుండాదే రోషం యీ యమ్మకి," అని గొణుగుతూ మా అమ్మ నా వెనకే బయటకు వచ్చింది.

"ఆ యమ్మని గుర్తుపట్టినావంట్రా," అని అడిగింది మొత్తని ఆనుకుని కింద కూర్చుంటూ.

యెవురన్నట్టుగా చూశాను ఆమెవైపు.

"యిజియా గదా. లొక్కిది యిజియా," అనింది.

"సోంబావ భార్యా?" అని దిగ్భ్రాంతితో తల పక్కకి తిప్పి సాలవైపు చూశాను.

సాల ముందు యే అలికిడీ లేదు.

*

"అకా రేపొకతూరి మా యిజియాతో గూడా పేటదాకా పొయిరావాల," అన్నాడు మా సోంబావ బెంచీ మీద నా పక్కనే కూర్చుంటూ.

కుట్టు పూర్తయిన యిస్తరాకుని గుండ్రంగా కత్తిరిస్తూ , పని ఆపకుండానే యెందుకన్నట్టుగా మా అమ్మ కళ్లెత్తి చూసింది.

"నిన్న అక్కంపేటకి బొయ్యి రంగమ్మని పిలిసే సొచ్చినా సుక్కసారి బెట్టించుకోని పొదువుగానీ రా చెల్లా అని. రేపు సందేళకంతా దిగెయ్యబోతాది. నూర్రూపా యలు బొయినా మంచి కోక తేవాలకా," అన్నాడు నా లెక్కల నోటు పుస్తకంలోకి తొంగి చూస్తూ.

"అట్నేగానీ లేరా. నేను గూడా బందారాకు కొను క్కొచ్చుకోవాల. రేపు శంకుబడ్తానే పోదాంలే," అనింది మా అమ్మ. కుట్టిన ఆకుని తిరగల రాయి కింద వత్తుకి పెడుతూ.

యింతలో విజయమ్మ వచ్చి పందిటి గుంజకు ఆనుకుని కింద కూర్చునింది.

"మే యిజియా రేపు శంకుబట్టేయాళకు పనవ జేసుకుని రెడీగా రా," అనింది మా అమ్మ కుట్టాల్సిన ఆకులు కొన్ని విజయమ్మ ముందుకు తోస్తూ.

విజయమ్మ బుగ్గ నిండుకీ ఎప్పుడూ వక్కాకు వుంటుంది. చూపుడువేలినీ నడుమ వేలినీ యెడం చేసి పెదాల ముందు ఆనించుకుని తుపుక్కున వాకిట్లోకి వూసింది. అరచేత్తో పెదాలు తుడుచుకునింది. యెడమ కాలు ముడుచుకుని కుడికాలు బారచాపుకుని ఆకులు చేతికి తీసుకునింది.

"బిన్నా వొచ్చెయ్యాలకా," అనింది.

మా అమ్మ ఆమె మాటని పట్టించుకోకుండా సోంబావ వైపు తిరిగి, "రే సోమయ్యా నాకూ వుండాడు ముగ్గరు అన్నదమ్ములు గుండ్రాయిల మాదిరిగా, యేమిటికా? వొక సారె యెరుగుదునా వొక సాంగెం యెరుగుదునా? మా యక్కగదాని యేనాడైనా వొకనా డన్నా యింటికి పిలిచి వొక రైగ్గుడ్డన్నా బెట్టుణ్ణా... అను కుంటే పొట్టపేగులు పెళ్లుకోనొస్తాయి," అనింది బాధగా.

"చినమ్మా వొకరుబెట్టలేదని బాదలా. వొకే అమ్మ కడుపున బుట్టకపొయినా యీన మాత్రం నీ అన్న దమ్ముడు గాదా. నీకన్నా యెవురుండారు మాకు మంచీ సెబ్బరకి. మా యింటికి రా. మంచి ఫుల్ వాయిలుకోక బెడ్తా," అనింది విజయమ్మ వెంటనే.

"అవునుకా... చెల్లితోబాటే మా యక్కా అను కుంటా నువ్వుగూడా రా," అన్నాడు మా సోంబావ.

"ఆ మాటన్నావు చాల్లేరా," అనింది మా అమ్మ యెడం భుజం మీది పైటను కొంచెం లాగి కళ్లు తుడుచుకుంటూ.

నాకు లెక్కల మీద మనసు నిలవడం లేదు. పుస్తకం మూసి సంచిలో పెట్టేశాను.

మరుసటిరోజు బడి వదిలి యింటికి వచ్చేసరికి నేను వూహించినట్టు యిల్లు బీగం వేసి లేదు. చిలుకు

పెట్టి వుంది. మా అమ్మని వెతుక్కుంటూ సోంబావ వాళ్లింటికి వెళ్లాను.

వీధి తడిక తీసేవుంది. తాటాకు పందిరి కింది నులక మంచం మీద మా సోంబావ ముడుచుకుని పడుకుని వున్నాడు. మా అమ్మ తిన్నెమీద కూర్చుని వుంది. తిన్నెని ఆనుకుని నేలమీద విజయమ్మ కూర్చుని వుంది.

పీనుగ లేసిన యిల్లు మాదిరిగా వుంది అక్కడి వాతావరణం. సంకోచంగా మా అమ్మ పక్కన వెళ్లి నిలబడ్డాను. ఆమె నావైపు వొకసారి చూసి లేచి మా సోంబావ పడుకుని వున్న మంచం దగ్గరకు వెళ్లి మంచం పట్టి మీద కూర్చునింది.

"ఒరే సోంగా... మొగోడివి అట్ట జంకిపోతే యెట్ట. బతుకన్నాక కష్టం సుకం రెండూ వుంటాయి. బాద లొచ్చినపుడు బేలబడిపోతే యెట్ట. తట్టుకోని నిలబడి సమాళించుకోవాల. నాలుగునాళ్లు తాళితే మిల్లు తెరవ కుండా బోరు. యింతలేకే ఆకాసెం నెత్తిమింద కూలి పోయినట్లు యేందిదా? శెట్టికి మాత్రం కడుపు లేదా, పెగ్గికి బొయ్యి మిల్లు మూసు కున్నాడుగానీ, మిల్లు మూసుకోని కడుపుకేం తింటాడు. రేపో మాపో మళ్లీ తెరవరా యేంది. యీ మద్దెన అప్పోసొప్పో జేసి రాయో రప్పో మోసి యెట్నో వొకట్ట బతకాల గదా," అని అనున యంగా చెప్పింది.

"య్యో.... యెందిదా... మొగుడు జచ్చిన అడి దాని మాదిరిగా, సాలుగాని లెయి. యిది వూరా అడివా. అందురూ బతికినట్టే మనం గూడా బతకబోతాంగానీ లెయి. పని పూడ్సింది నీ వొక్కిడికేనా యేంది. నీ మాదిరి గానే మిగిల్నోళ్లందురూ యేడస్తా మూలన పొణుకో నుండారా, లేసి కాలుమొకం కడుక్కో. అక్కంపేట నుండి మీ చెల్లి వొచ్చెయ్యబోతాది, సుక్కసారి బెట్టించు కునేదానికి. యీ తూరికి మాగ్గలిగింది యింతేమా అని రైగ్గడ్డబెట్టి అంపిచ్చేస్తాంగానీ లెయ్యి," అని విజయమ్మ సోంబావ భుజం పట్టుకుని లేవదీసింది.

" లెయ్..రా..లెయ్.. యిజియా జూడా యెట్ట దిటువుగా వుండాదో. లేసి కోనేటికట్ట మిందికి బొయ్యి యిన్ని టీనీళ్లు తాగేసి రా బో," అనింది మా అమ్మ అక్కడనుంచి బయటకు కదులుతూ.

నా చెయ్యి పట్టుకుని, "బడొదల్తానే మొకం కాళ్లు కడుక్కోని యింట్లో వుంటే యేమి. గుద్దెనకాల్నే రావాల్నా," అని విసుక్కునింది.

*

మా సోంబావకీ మాకూ చుట్టరికం యేదీ లేదు. వరుసలు కలుపుకోవడానికి మా వూళ్లో మాకు కులాలు బంధుత్వాలూ అవసరం లేదు. యేటి కవతల కాటన్ మిల్లులో మా సోంబావ ఫిట్టరు. మంచి పనోడని పేరు. మా సోంబావ స్పానరు పడితే యెంతెత్తు మిషనయినా కుక్కపిల్ల మాదిరిగా మాటినాల్సిందే. అందుకే మిల్లులో మా సోంబావకి మంచి మతింపు. మిల్లు యజమాని శెట్టియార్‌ది కోయంబత్తూరు. ఆ వూళ్లోనూ ఆయనకి వొక కాటన్‌మిల్లు వుంది. అక్కడ మిషన్లు యెప్పుడ యినా మొరాయిస్తే ఆగ మేఘాల మీద మా సోంబావని కారులో యెక్కించుకుని కోయంబత్తూరుకి తీసుకు వెళ్తారు. 'సోముడికేమబ్బా కోయంబత్తూరు శెట్టంత టోడే నెత్తిన బెట్టుకోనుండాడు,' అనేవాళ్లు అందరూ.

నల్లటి తల వెంట్రుకలను కమ్మేసిన తెల్లటి దూది ధూళితో డ్యూటీ దిగి చెల్లెమ్మ యేటిగుండా వూళ్లోకి నడిచేపుడు చూడాలి మా సోంబావని! పని అలసట కన్నా మిల్లులో పనిచేస్తున్నానే గర్వమే ఆయన వేసే ప్రతి అడుగులో కనిపించేది.

కానీ, హఠాత్తుగా వొకరోజు మిల్లు లాకౌట్ చేశారు. సమ్మె మొదలయింది. మా సోంబావ మాత్రం సమ్మెకి దూరం. ఆయన మేనేజ్‌మెంట్ పక్షం. సమ్మె చేసే కార్మికులు సోంబావని చెడ తిట్టేవాళ్లు. ఆయన మాత్రం యింటిపట్టునే వుండేవాడు. మిల్లు యెప్పుడు తెరుస్తారా అని అసహనంగా యెదురుచూసేవాడు. నెలయింది. రెండు నెలలైంది. మిల్లు తెరవలేదు. సమ్మెకు రాజకీయ పార్టీల మద్దతు లభించింది. 'రేపో మాపో గవర్నమెంటు మిల్లు స్వాధీనం చేసుకుంటుం దంట. నెల్లూరులో మాదిరిగా కోఆపరేటివ్ మిల్లుగా మారుస్తుందంట,' అని అందరూ అనుకోవడం ప్రారం భించారు. మా సోంబావకి భయం పట్టుకునింది. వొక రోజు సాయంత్రం సమ్మె శిబిరంలోకి వెళ్లి అందరితో కలిసి కూర్చున్నాడు. యింకో వారం రోజులకి మిల్లు తెరిచారు. కానీ పాత కార్మికులతో కాదు. తమిళనాడు నుంచి తీసుకువచ్చిన కొత్తవాళ్లతో మిల్లు నడిపించారు. పాతవాళ్లు వాళ్లని అడ్డు కున్నారు. గొడవలు జరిగాయి. తలలు పగిలాయి. పోలీసు కేసులయ్యాయి. మా సోం బావ గొడవలకి దూరంగా వున్నాడుగానీ మిల్లులో మళ్లీ పని దొరకలేదు. స్థానికులెవ్వరినీ మళ్లీ పనిలోకి తీసుకో లేదు. మిల్లు కార్మికులంతా కూలీలుగా మారిపోయారు. మట్టి పనికీ, సేద్యం పనులకీ వెళ్లేవారు. అందరితో పాటు మా సోంబావ, విజయమ్మ కూడా కూలిపను

లకు వెళ్లేవాళ్లు. కానీ వూళ్లో పనుల్లేవు. కార్మికులు పస్తులతో దారుణమైన అవస్థలు పడేవాళ్లు. ఆ కష్ట కాలంలో వొకరోజు ముఖం నల్లగా పెట్టుకొని సొంబావ మా యింటికొచ్చాడు.

"అకా తిరేంగళం జూడకా పేట్లో బస్టాండు కాడ కనిపించినోళ్లందరి ముందర చెయ్యి జాపి అడుక్కుంటా వుండాడకా," అని మా అమ్మ ముందు కళ్ల నీళ్లు పెట్టుకున్నాడు. తిరువేంగళం మా సొంబావతో పాటు మిల్లులో ఫిట్టరుగా పనిచేసే వాడు.

"సోమయ్యా... నేనొక మాటంటా. యోచన జెయ్యి. పల్లోడికి పుట్టి యీ పనేంది అనుకోబాక. అమర్జోతి అని పారిన్ సౌతు వచ్చినాక మనూరి దేవాంగలీది కత యెట్టుండాదో తెలుసుగదా! వారానికి రొండు తూర్లు కుంటి సాయిబు కూరాకు కోస్తా వుండాడు. గెద్దలు తన్నకపొయినట్టే గదా! కలర్ సోడాలేమి, పండ్ల బుట్టలేమి, చేపలగంపలేమి అంతా యిప్పుడు ఆ రెండీదులే గదా తిరగాడతా వుండాయి. వారం దినాలు కష్టపడితే రొండు నూర్లు అలాగ్గా చేతల్లో బడతావుల్లా. అగుమానం అనుకో బాక. రగురామయ్య కొటాయి కాడికి బొయ్యి నాల్దినాలు ఆయన చేతికింద నలిగినావంటే పని నేర్చుకోవచ్చు. దేవాంగల పుట్టక పుట్టలేదు గదా మనకి రాబోతాదా యీ పని అనుకోబాక. కష్టానికి పాలుమారనోడికి యే పనయినా అనావసిం గదా," అని మంచి మాటలు చెప్పింది మా అమ్మ.

మా అమ్మ మాటను చెవిన వేసుకున్నాడు మా సొంబావ. మూడునెలలు తిరిగేసరికి యింట్లోనే సొంతంగా మగ్గం పట్టుకున్నాడు. రఘురామయ్య దగ్గర పడుగు తెచ్చుకుని కూలికి నేశాడు.

సంవత్సరానికంతా పూరింటి పక్కనే సాలవేసి రెండు మగ్గాలు పట్టాడు. వొకదాంట్లో తను దిగి నేసేవాడు. రెండో దాండ్లో కూలిచ్చి మనిషిని దింపాడు. విజయమ్మ కండెలు చుట్టేది. అచ్చు అతికేది. అన్నానికి లేసినపుడూ, పని బడి బయటకు వెళ్లినపుడూ మా సొంబావ మగ్గంలో విజయమ్మ దిగి నేసేది.

బడొదలగానే నేను మా సొంబావ మొగ్గం కొటాయికి వెళ్లేవాడిని. వూలు దూర్చేపని నాది. సొంబావకి కుడిపక్కన కూర్చుని పొగుల మధ్య నాడి దూరుస్తూ వుండాలి. విజయమ్మ పచ్చటి పసుప్పూసుకున్న ముఖం మీద నుదుట రూపాయి బిళ్లంత బొట్టు పెట్టుకుని బుగ్గన వక్కాకు నములుతూ రెండు మగ్గాల మధ్య కూర్చుని కండెలు చుడుతూ మా సొంబావతో ముచ్చట్లాడేది. ఆరోజుల్లో ఆ యింట్లో యెప్పుడూ యేదోవొక చిరుతిండి వుండేది. సొంబావ మగ్గంగుంట్లో దిగి నేస్తూ వుంటే గట్టుమీద కూర్చుని కొసరి కొసరి తినిపించేది. పండ్లూ ఫలహారాలతో నవ్వులతో ఆ యిల్లు కళకళలాడుతూ వుండేది.

*

"అకా యింటిదాకా వొచ్చిపో," అనింది పరుగున వచ్చిన ఆయాసంతో విజయమ్మ.

ఆమె కళ్లనిండా ఆందోళన.

వీధి తలుపు చిలుకుపెట్టి మా అమ్మ బయటకు నడిచింది. నేనూ ఆమె వెనుకే బయలు దేరాను.

నులక మంచం మీద మా సొంబావ వెల్లకిలా పడి వున్నాడు. వొంటిమీద గుడ్డ సరిగా వున్నదీ లేనిదీ కూడా స్పృహలేదు. మూలుగుతున్నాడు. గొణుగుతున్నాడు.

మా అమ్మ మంచం పట్టిమీద చెయ్యి ఆనించి వొంగి!

"రే.... సోమయ్యా... సోమా... రే..." అని పిలుస్తూ చెంప మీద చురుకు తగిలేలా కొట్టింది.

సొంబావ కనురెప్పలు కష్టంగా పైకెత్తి చూసి నవ్వు ముఖం పెట్టాడు. ఆ నవ్వు తుంటరిగానూ వెర్రిగానూ వుంది. అర్థంకాని అస్పష్టపదాలేవో గొణుగుతూ పక్కకి తిరిగాడు. నోట్లోంచి తెల్లటి నురగలాగా ఎంగిలి ధారగా కారుతోంది. విజయమ్మ ముందుకు వచ్చి లుంగీ సర్దింది.

"మే యెరగెడ్డొకటి తీసకరాబో," అని పని పురమాయించింది మా అమ్మ.

యెరగడ్డను సొంబావ పెదాల మధ్య నుంచి పళ్ల దగ్గరకు నెట్టింది.

"సోమయ్యా... రే... దీన్నట్ట నవులు..." అంటూ పళ్లను చేత్తో విడిదీసి యెరగడ్డను లోపలికి తోసింది.

తూపూమని బయటకు వూసేశాడు. పళ్లు బిగబట్టేశాడు. వెర్రిగా నవ్వుతూ యేదేదో మాట్లాడడం ప్రారంభించాడు.

విజయమ్మ దుఃఖం కట్టలు తెంచుకునింది.

"అకా... ఆ జాండ్రపేట గుంపుకదా యీ వాటాన జేసిపెట్టింది. వొంచిన తలెత్తకుండా మొగ్గం నేసుకునేవాడు. యెట్టయిపొయ్యాడో జూడు. గెంటసేపన్నా గుంట్లో దిగి నేస్తే గదా! పొగులనిలా, రేత్రనిలా పరంట పక్కే పనయిపొయింది. తాగేది, కచ్చేరిబడిలో చీట్లాడేది. అడిగితే యెట్టంటే అట్ట మాట్లాడేది. వాళ్ల కాపరాల్లో

నిప్పులు బడ. యెట్టాంటి మనిషిని యే గెతి బట్టించారో జూడు. వాళ్లు నాసినమైపోను. వాళ్లని చెల్లెమ్మ యేట్లో బెట్ట...''

సోంబావ వొక్క వుదుటన పైకి లేశాడు. పంచె వూడి కింద పడిపోయింది. అరచేత్తో యాడ్చి విజయమ్మ ముఖం మీద బలంగా కొట్టాడు.

యీ హఠాత్ ఘాతానికి ఆమె చుట్టు గుడిసె మొత్త మీద వెళ్లి పడింది.

''కొట్టి సంపేస్తుండాడ్రా దేవుడో,'' అంటూ ఆమె పెద్దగా యేడుపు మొదలుపెట్టింది. చుట్టుపక్కల యిళ్ల వాళ్లు వచ్చి మూగారు.

సోంబావ కింద పడిన పంచెను తీసుకుని వుండగా నడుముకి చుట్టుకున్నాడు. రెండు అడుగులు తూలుతూ నడిచి వీధి తడిక మీద దబ్బున పడ్డాడు. గొణుగుతూ పడుతూ లేస్తూ వీధిలోకి నడిచాడు.

*

పదిహేనేళ్ల కిందటి సంగతులు, దృశ్యం కట్టినట్టుగా వొక్కటొక్కటే నాకు జ్ఞాపకానికొస్తున్నాయి.

''నువ్వు నెల్లూరికి బోయినాక చానా కత జరిగిందిలేరా,'' అనింది మా అమ్మ ఆ కథంతా చెప్పడానికి సిద్ధపడుతూ.

మొత్త దగ్గర నుంచి లేసి వాకిట్లోకి వెళ్లి ఆకాశంలోకి చూసింది. తిరిగివచ్చి తిన్నెను ఆనుకుని కింద కూర్చునింది. ''పెద్దోడా... నువ్వా దినాల్లో సదివే దానికని నెల్లూరికి బోతివి. అణ్ణించట్నే కమీనిస్టుల్తో గల్సి దేశం తిరిగే దానికి మల్లుకుంటివి. నీకేనాడన్నా యిల్లనీ, వూరనీ పట్టిందా. యేం తిన్నామో యెట్ట బతికామో యెంగటేస్పర సామికే తెలియాల,'' అని నిష్ఠూర పోయింది.

''అయిద్రాబాదులో వుజ్జోగంలో చేరినాకే గదా నువు యీపక్క తొంగిజూస్తా వుండావు. పెళ్లి జేసుకున్నాక ఎవురి కతయినా యింతే నాయినా,'' అనింది ఎగతాళిగా.

''సరే అదట్టుణ్ణీ గానీ సోంగాడి కత యిను, ఆ దినాల్ల సోంగాడికి వూళ్లో యెంత మతింపు. సోంగాడు గూడా చిన్నా పెద్దా యెరిగి గదా మెసిల్నాడు. యెంత అణకవ. యింటికాడ తలొంచినాడంటే మిల్లు గేటు కాడ్నే యింకన తల పైకెత్తేది. మళ్లీ మిల్లుకాడ వొంచినాడంటే యింట్లోకి అడుగుపెట్టినాకే గదా పైకెత్తేది. అద్దరేత్రి అనిలా అపరేత్రి అనిలా యెవురికి యే అక్కరొచ్చినా యే ఆపదొచ్చినా నేనుండా అని వొచ్చేవాడు.''

ఆమె కనుగుడ్ల మీద తొణికిసలాడిన చెమ్మ గత కాలపు తియ్యటి జ్ఞాపకాలను ప్రతిఫలించింది. ఆ అనుభూతిని ఆస్వాదిస్తున్నట్టుగా చూపును శూన్యంలో నిలిపి వొక్క నిమిషం మౌనం వహించింది. యింతలోనే ఆమె కనుబొమలు ముడుచుకున్నాయి. దుఃఖపు తెర యేదో ఆమె జ్ఞాపకాల పొరల్లోంచి వెలికి వచ్చింది.

''యెదవ నాసినం మిల్లు- యెట్టాంటి మనిషిని యే గెతికి తెచ్చింది,'' అనింది.

''మిల్లు పని పోతే పాయిందిబో. మొగుడూ పెళ్లాలు మొగ్గం నేసుకుంటా కూటికి గుడ్డకి లోటు లేకుంటా బతికిపాయినారు గదా అనుకుంటా వుంటే ఆ ముండమోపి అమర్జోతి సొతు నోటికాడ కూటిని గూడా లాగేసినే,'' అని ఆగి నావైపు చూసి, ''చిన్నబయా నీకు గుర్తుకుండాదా సోమయ్య కొటాయిలో అమర్జోతి వూలేసేవాడివి నువ్వు గూడా,'' అనడిగింది.

గుర్తుందన్నట్టుగా నేను తల వూపాను.

''దేవాంగల వొంటిమింద గుడ్డలా. కంటి మింద రెప్పలా. రేత్రీ పొగులూ నేసిందే నేసింది గదా. అమర్జోతి గిరాకి అట్టుణ్ణింది అప్పుడు. మెడ్రాసులో కొండ మాదిరిగా గుట్టబడి పోయినాయంట నేసిన సాపులు. పారినోళ్లు యింకీ గుడ్డ మాకొద్దు సామీ అనేసినారంట. ఆ దెబ్బ చిన్నంగానా తగిలింది దేవాంగలకి. గుడ్డ నేస్తే కూలి గిట్టకపాయ. ముసిలీముతకా పిల్లాజెల్లా అందురూ సేద్దిం పనలకి మల్లుకుంటిరి. తొవ్వాటానికీ, సెనగ పెరుకుళ్లకీ, మిరపకోతలకీ- యాడ జూసినా దేవాంగలే జేరుకుంటిరి. అయినా అన్ని కాలాల్లోనూ సేద్దిం పనులు చేతి నిండికీ వుండేదానికి మనూర్లో యేర్లూ కాలవలూ యేమన్నా పారతా వుండాయా? అబ్బ... వాళ్ల అవస్తలు కళ్ల జూళ్లేకపాయినాం అనుకో. ఆకిల్తో అల్లాడిపాయినారు. కుటుంబరాలు కుటుంబరాలుగా దేవాంగలు యిళ్లూ వాకిళ్లూ వొది లేసి చీరాల పక్క పనులుండాయని కొళ్లబొయినారు గదా. మిగిలి పాయిన ముసలీ ముతకా వూళ్లో బిచ్చం అడుక్కొని గదా పేణాలు నిలుపుకున్నారు.''

''యిజియా సోమయ్యా గూడా దొరికినన్నాళ్లు కూలిపన్లకి పోతిరి. ఆ పిల్ల నిండు కడుపుతో వుంటే సోముడు మట్టి పననిలా రాయి పననిలా యేపని దొరికితే ఆపనికంతా పాయినాడు. వొళ్లు దాచుకోలా. కూలో నాలో జేసుకుంటా ఆ యమ్మిని ముదిగారంగా గదా చూసుకున్నాడు. తొలిచూలు మొగబిడ్డని కనింది. కానుపయిన నెలదినాలకే అనుకుంటా యెర్రమట్టి

దిబ్బల్లో మట్టి లోడతా వుంటే పెళ్ల కూలి పొయ్యి సోం గాడి నడుము లిరిగిపాయ. మూడునెల్లు మంచంలో పడుంటే నిండు బాలింతరాలు యిజియాగదా కొనేటి కట్ట మింద బొండాలూ మురుకులూ కాల్చి సంపా యించి పెట్టింది,'' మా అమ్మ మాటలకు అడ్డు తగులుతూ మా వదిన వచ్చింది, ''అతా పులుసులో వుప్పు సరిపాయిందేమో జూడు,'' అంటూ.

మా వదిన చేతిలోని గంటిలోంచి అరచేతిలోకి పులుసు వంచుకుని నాలుకతో నాకి సరిపాయిందన్న ట్టుగా తలూపింది. చేతిని చీరకి తుడుచుకుని తిరిగి ప్రారంభించింది.

''పొరికెదవల సావాసం జేసిగదా వాడు కాపరం నాశినం జేసుకున్నాడు,'' అనింది.

''తాగేదీ, ఆ యమ్మిని చావబాదేదీ. చీట్లాడేది. యెదవయిపాయినాడు గదా,'' అని గొంతు తగ్గించి.

'అప్పుడు పరంటీది పిల్లనొకదాన్ని గూడా పెట్టుకో నుణ్ణాళ్లే,'' అనింది.

''ఆ వొగిలాడి ముండ యేందో ముందు బెట్టే సిందంట. పెళ్లాంలా, బిడ్డలా ఆ పిల్ల ఎనకాల్నే తిరగ లాడేది. అనేక ఆయమ్మ యింకెవుడితోనో యెల్లి పాయిందంట. మళ్ల అప్పుడొచ్చిపడ్డాడు యింట్లో,'' అనింది వాకిట్లో నీళ్లు చల్లి సందముగ్గు బెడుతున్న మా వదినని చూస్తూ.

''ముగ్గుపిండి అయిపాయిల్లా. రేపు అన్నాల్దిన్నాక యేటికి బొయి తెల్లిసిక దెచ్చుకోని కలుపుకోవాల,'' అనింది మా వదినతో.

మా వదిన పైటకొంగుకి చేతులు తుడుచు కుంటూ అడిగింది. ''అతా... వుండూళ్లో సొంతిల్లు బెట్టుకోని అరువుగా యిడ్లీలో దోసిలో పోసుకోని బతక్క ఆ మొగుడూ పెండ్లాలు యీ టవునుకెందుకొచ్చి చేరినట్టు''

''యెందుకంటే... బతకదామనిగదా. వూరొదిలేస్తే నన్నా బాగుపడ్తాడని ఆ యమ్మ ఆశ,'' అనింది మా అమ్మ.

''తో... యీడ జేరిన తొలినాళ్లలో మరీ యింతి దిగా లేరతా. ఆ యన్న టీ యేసేవోడు. ఆ యక్క నాస్టా గాల్చేది. సందేళయితే అంగిడి మూసేసి యిద్దరూ పిండి రుబ్బతా కనిపించేవోళ్లు,'' అని చెప్పింది మా వదిన.

''కుక్క తోకని యెంత సాగదీస్తే మాత్రం వంకర తీరతాది...? మొగోడి బుద్దే అట్టాంటిది,'' అని నావైపు వొకసారి చూసి కొనసాగించింది మా అమ్మ.

''కాపరమన్నాక మాటా మాటా అనుకోకుండా మొగుడూ పెళ్లాలనేవాళ్లు వుండరు. కానీ యిదేం పాడో గానీ యీ మొగుడూ పెళ్లాలు వొక కప్పు కిందనే కలిసి కాపరం జేస్తానే వుంటారు. పామూ ముంగీసల మాదిరిగా కలబడి కొట్టుకుంటానే వుంటారు.''

''కొట్టుకుంటా వుంటారంటే మామూలు గానా, ఆ యక్కని వంగన బెట్టి యెట్ట బాదతాడనీ,'' అనింది మా వదిన చీత్కారంగా.

యీ మాటలన్నీ వింటుంటే నాకు మా సోం బావ మీద చెప్పరాని అసహ్యం కలుగుతూ వుంది.

''వొకదినం యేంజేసినాడా... యిట్నే ఆ యమ్మని కొట్టాడా, ఆ యమ్మ తిరుక్కుని రెండు పీకింది. అంతే అగుమానం అయిపొయింది యీ మొగోడుకి. రైలు కిందబడి చస్తా అనేసి పొయ్యాడు.''

''పడి సచ్చినా పాయుండేది పీడ,'' అనింది మా వదిన కోపంగా.

''చిన్నోడా... దినమ్మూ మాదిరిగానే బజార్లో యీపక్క ఆపక్క తిరిగేసి యెవురో వొకర్ని నాల్రూపా యలడిగి సారాయి తాగేసి రాబోతాడ్లే అనుకునింది యిజియమ్మ. అయితే చక్కాపాయినోడు యేంజేసి నాడా... నేరుగా పొయ్యి కోటపోలూరు గెరండాల దెగ్గిర రైలుకింద చేతులు పెట్టేసినాడు. రొండు చేతులూ మణికట్లదాకా తెగి అవతల పడిపాయినాయి.''

హఠాత్తుగా వొక చీకటి తెర నా కళ్ల ముందు వాలింది.

నా సమస్త శరీరంలోనూ వొక పెద్ద కుదుపు.

''అయ్యో,'' అన్నాను వెంటనే.

''అయ్యో అంటే పాపం ఆ యెదవకి,'' అనింది మా అమ్మ అందుకుని.

అవిటివాడే అని కూడా లేకుండా మా అమ్మ కోపంగా మాట్లాడడం నాకు నచ్చలేదు. నా అసంతృప్తిని పసిగట్టినట్టుగా ఆమె మాటలు కొనసాగించింది.

''యింకన జూడు ఆ యమ్మ బాదలు. ఆ నెత్తురు ముద్దని మెడ్రాసు జెన్రలాస్పత్రికి యేస్కోని బొయింది. ఆడ యెవురి కాళ్లు బట్టుకునిందో యెట్ట జేసిందో యే కష్టాలు పడిందో యేమోగానీ, మూడు నెల్లు కంటికి రెప్పమాదిరిగా కాపాడుకునింది. పేణాల్లేని కట్టెని గదా ఆస్పత్రికి యేసుకోని బొయింది. మళ్ల మనిషిని జేసి తొడుకోనొచ్చింది.''

''కాపాడుకునిందిగానీ, కొరివి నెత్తిన బెట్టుకున్నట్టే గదా! అవిటి మొగుడికి సేవలు జేసునా. టీ యంగడి

జూసుకుణ్ణా,'' అనింది మా వదిన. ఆమె మాటల్లో విజయమ్మ పట్ల అంతులేని సానుభూతి వుంది.

''అవును... మొండి చేతులేసుకొని ఆ యెదవేమో గెట్టుమింద పెద్దరెడ్డాల కూకోనుంటాడు. ఆ యమ్మ కష్టం కళ్ల జూళ్లేక పోతుండాం అనుకో. ఆ మనిషికి పంచె గట్టాల చొక్కాయి యెయ్యాల. బీడీ కాల్చి నోట్లో బెట్టాల. అడ్డాల బిడ్డని జూసుకున్నట్టే గదా. ఆకిరికి ఆ మనిషికి గుద్ద గడిగే పని గూడా ఆ యమ్మే జేసునే,'' అనింది మా అమ్మ విచారంగా.

''కష్టమో నష్టమో పడి పెడతా వుండాది గదా. తిని పడుంటే యేమి,'' అనింది మా వదిన యీస డింపుగా.

''బెంచీమీద కూకునేది... కారుకూతలు కూసేది. ఆ యమ్మ తిరిగి వొక మాటంటే సాలు. చేతుల్లేవు గదా, కాళ్లతో యెగిసెగిసి తన్నేది.''

''కాళ్లతోనా... తంతాడా,'' అని గొణిగాను నమ్మ లేనట్టుగా.

''యేషాలుగానీ... యెందుకాయమ్మ యీ మనిషి దెగ్గిర యింకా పడుండేది. వొళ్లు హూనం జేసు కుని సంపాయించ్చి పెట్టేదెందుకు. చావ తన్నులు తినే దెందుకు. యాడయినా బిడ్డల్ని బెట్టుకోని అరువుగా ఆయమ్మ బతుకు ఆయమ్మ బతకచ్చునే,'' అనింది మా వదిన విసుగ్గా.

ఆమె మాటలు కరెక్టే కదా అన్నట్టుగా నేనూ తలూపుతూ మా అమ్మ వైపు చూశాను.

ఆమె ముఖంలో కనిపించీ కనిపించని చిరు నవ్వు క్షణకాలం మెరిసి మాయమైంది. ఆ నవ్వులో మా ఇద్దరి పట్లా యెంతో జాలి వుంది.

ఆ మధ్యాహ్నం ఇంటి నుండి బయటకు వస్తూ సాల వైపు తల తిప్పి చూశాను. టీ బాయిలర్ వెనుక నుంచి విజయమ్మ నన్ను చూసింది.

''అబయా... యెప్పుడా రావడం,'' అని పలక రిస్తూ బయటకు వచ్చింది.

అక్కడే నిలబడ్డాను.

''దినామూ అమ్మని అడగతానే వుంటా. బాగుం డావా. అన్నదమ్ముళ్లు అప్పజెల్లెళ్లు అందురూ యాణ్ణే వుంటే, నువ్వొక్కడివీ దూరాబారం బోతివి,'' అనింది.

చిరునవ్వుతో తలవూపి నిన్న సాయంత్రంనాటి బీభత్స చిహ్నాలేమైనా కనిపిస్తాయేమో అని ఆమె ముఖం లోకి చూశాను.

తేటగా, హాయిగా వుంది విజయమ్మ ముఖం.

''యీ తూరన్నా పప్పన్నం బెడ్తుండావా లేదా,'' అని అడిగింది.

నేను నవ్వి, ''పిలకాయలు బాగుండారా కా,'' అనడిగాను సాలలోకి చూస్తూ. లోపల చీకటిగా వుంది.

''అగ్గో... లోపల పొణుకోనుండాడు మీ బావ,'' అని సాలలోకి తొంగిచూసి- ''యేం బా... యీడెవు రొచ్చుండారో జూడు,'' అని అరిచింది.

నా గుండె వేగం పెరిగింది.

రెండు చేతులకీ కట్లతో మా సోంబావ బయటకు వచ్చాడు. భుజాల చుట్టూ యెర్రటి టవలు కప్పుకుని వున్నాడు. పెరిగిన గడ్డం. మడిచి ఎగ్గట్టిన మాసిన లుంగీ. ఎముకలు తేలిన వొళ్లు. నేను మగ్గం కొటాయి లో చూసిన సోంబావ కాడు యితను.

''బాగుండావా,'' అన్నాడు పలకరింపుగా.

''బాగుండాను బావా,'' అన్నాను. కొనసాగించ డానికి మాటలేవీ దొరకలేదు. కానీ చాలా మాట్లాడా లని మాత్రం వుంది.

''వూరి దాకా పోతుండా, సాయంకాలం వస్తాను బావా... వస్తాకా...'' అనేసి గబగబా ముందుకు కదిలాను.

పల్లె నుంచి యింటికి పోకుండా ఆ సాయంత్రం నేరుగా టీ యంగడిలోకి నడిచాను.

బెంచీ మీద మా సోంబావ వొక్కడే కూర్చుని వున్నాడు.

''రా... అబయా,'' అన్నాడు నన్ను చూసి.

''అక్కేదా,'' అని అడిగాను.

''బజార్దాకా పొయింది,'' అన్నాడు బెంచీ మీద పక్కకి జరిగి.

పక్కనే కూర్చున్నాను.

''యిజియా గూడ లేకపొయినే. కాపీ నీళ్లు బెట్టిచ్చేదానికి,'' అన్నాడు.

భుజం మీద నుంచి జారిన టవలును సర్దు కోవడానికి ప్రయత్నిస్తున్నాడు నేను టవలును తీపి భుజాల చుట్టూ కప్పాను.

''యేంది బావా యీ పనా?'' అన్నాను.

కొన్ని క్షణాల నిశ్శబ్దం తర్వాత, ''రాత,'' అన్నాడు. అతని కళ్లనిండా నీళ్లు.

ఆ తర్వాత సంభాషణ కొనసాగలేదు.

''మళ్లస్తా బావా,'' అని లేశాను.

''నాల్దినాలుంటావా,'' అని అడిగాడు.

''ఆ,'' అని బయటకు నడిచాను, ఆవేదనగా, అసంతృప్తిగా.

మరుసటి రోజు సాయంత్రం మళ్లీ టీ అంగడి దగ్గరకు వెళ్లాను.

విజయమ్మ పప్పు రుబ్బుతూ వుంది.

మా సోంబావ అలికిడి లేదు.

"బావేడీ?" అనడిగాను, లేకపోతే బావుణ్ణు అని అనుకుంటా.

"యింకేడికి బోతాడు. నెప్పి తాళలేకుండా వుండా దిమే... అని పదైదు రూపాయిలు పెరుక్కొని బొయి నాడు సారా యంగడికి," అనింది నవ్వుతూ.

"యింకా తాగతానే వుండాడా యిట్ట బెట్టుకోని చేతులు," అన్నాను.

"పెళ్లాం బిడ్డలు లేకపాయినా అదుంటే చాలు ఆ మనిషికి," అనింది రోలుపక్కనే వున్న నీళ్ల దబరలో రెండు చేతులు ముంచి కడుక్కుంటూ.

పైట కొంగుతో చేతులు తుడుచుతుని లేచి బాయిలర్ దగ్గరకు వెళ్లింది. కొళాయి తిప్పి వేడి నీళ్లతో గ్లాసు కడిగి కాఫీ కలిపి నా చేతికిచ్చింది.

నేను వొక గుక్క తాగి అన్నాను.

"అకా వొక మాటడగతా యేమనుకోవు గదా."

"అడుగబయా," అనింది.

"నీ కష్టం నువు జేసుకుంటుండావు. నీ కూడు నువ్వు తింటావుండావు. యింత జేసి ఆ మనిషి దెగ్గిర యీ దెబ్బలు తినేదెందుకు? యాడ టీ యంగడి బెట్టు కున్నా నీ మానాన నువ్వు సుఖంగా బతికిపోవచ్చు గదా, నీ బిడ్డల్ని బెట్టుకోని," అని అడిగాను.

నా ప్రశ్న వెనుక నిజాయితీని పరీక్షిస్తున్నట్టుగా ఆమె నా ముఖంలోకి చూసింది. వొక నిర్ధారణకి వచ్చి నట్టుగా పేడ అలికిన నేలమీద నిట్టాడి గుంజకు జార గిలబడి కూర్చుని మొదలుపెట్టింది...

"నిజమే... నా బతుకు నేను బతకచ్చు. గొడ్డు కన్నా యీనంగా గదా చాకిరీ చేస్తా వుండాను. నా రెక్కల కష్టం నేను బడతా వుండాను. నా కూడు నేను తింటా వుండాను. అయినా యీ కారుకూతలు యేమిటికి పడాల. యీ సావుదెబ్బలు యేమిటికి తినాల. ఛా... యెదవజల్మ అనుకుంటా వుంటా. యే యేట్లోనన్నా పడిసస్తే యింకీ బాదలుండవు గదా అనిపిస్తా వుంటాది. అబయా.... సస్తే సుకంగానే వుణ్ణు నాకు. అనేక, నా యిద్దురు బిడ్ల గతేం గావాల? యే కొనేట్లోనన్నా వాళ్లని గూడా ముంచి సంపేసిగదా నేను దూకాల," అని ఆగింది.

భయవిహ్వలమైన భావం ఆమె ముఖంలో కద లాడింది. ఆ ఆలోచనని కూడా యింక యెక్కువ సేపు భరించలేనట్టుగా వెంటనే అనింది-

"నావల్ల గాదు సామీ. బూమ్మీద అరువుగా బతుక్కో పొండి అనిగదా దేముడనే వాడు నా కడుపున ఆ యిద్దురు బిడ్డల్ని యేసుంటాడు. యేం పాపం జేసి నారని వాళ్ల పేణాలు తియ్యాల. నా వల్ల గాదబయా. అంత పాశాణంగాదు నేను," అని తల అడ్డంగా వూపింది.

"కూటికా, గుడ్డకా... కొరగాని మనిషి, తుట్ట మారుగా చేతుల్లేనోడు. యింకన యేనాటికైనా వొకిరికి బరువేగాని వొకిరికింత బెట్టే గెతిలేనోడు. యెందుకీ బాదలు పడాల వోడితో? వాడి వొంటికి సుకం యిచ్చేది. మల్ల వాడి దెగ్గిర పడదెబ్బలు తినేది. కడంతదాకా యిదే బతుకా... ఛా! కష్టానికి పాలుమారని మనిషిని. నా యిద్దురు బిడ్డల్ని బెట్టుకోని యాడైనా అరువుగా బతికి పోవచ్చునే. యీ వాటంగానే అనుకుంటా వుంటా నబయా నేను గూడా చానాతూర్లు... కానబయా... మొగుణ్ణొది లేసిన ఆడకూతురు వొంటిగా బతికేటట్టుం డాదా యీ కలిగ్గంలో. పెద్దింటి ఆడది మొగుణ్ణొది లేసినా, ముండమోసినా, నలుగురికి కొంగుబరిచినా సాగతాదిగానీ పేదరాలికి సాగతాదా. కాకులు గెద్దల మాదిర్తో గదా పొడిచి పొడిచి సంపేది. నా కష్టం నేను జేసుకుంటా నా కూడు నేను తింటే మాత్రం అయ్యో అని వొదిలెయ్యబోతుండారా యీ మొగనాబట్టలు. ఆడది అగ్గవగా దొరికిందనేసి కుక్కల మాదిర్తో చుట్టు కోరా. వొంటిగా బతికే ఆడకూతుర్ని లంజిని చేసేదాకా నిద్రబట్టబోతాదా యీ నా బట్టలకి. అనేక నా గెతేం గావాల, నా బిడ్డలేం గావాల."

"బతకలేకనే గదా యీదినబడి టీ యంగడి బెట్టుకునింది. ముక్కొల్రూపాయి బెట్టి టీ దాగడాని కొచ్చే ప్రెతి నా ముట్టిపాతకీ నాతో యాసండాలే నయి పాయ. నా మొగుడు చాతగానోడని అలుసుగదా!" అని వాకిట్లోకి తొంగి చూసి కొనసాగించింది.

"అబయా... వొక మాటంటా, కోపం తెచ్చుకో బాక. కన్నొంకరయినా, కాలొంకరైనా మొగోడు మొగోడే నబయా... ఆ బుద్ధి మారదు," అని నా ముఖంలోకి చూసింది. ఆమె ఎదురుగా ఉన్నది నేను కాదు, మా సోంబావ అన్నట్టుగా మాటలు మొదలుపెట్టింది. "కొంపాగోడూ నువు సారా యంగిడికి దారబోస్తివి. యింకెట్ట బతికేది? రోడ్డున బడితిమి. యింకన

యిప్పుడు బట్టుకోని- నువ్వు వోడితో మాట్లాడగూడ్దు. యీడితో మాట్లాడగూడ్దు అంటే యెట్ట జరగతాది? తీరుగా తలకి సవురు బెట్టుకోని జడేసుకుంటే తిడితివి. మంచి గుడ్డ గట్టుకుంటే అనరాని మాటలంటివి. అంగి డన్నాక మనిషీ మాకూ రారా? మంచీ సెబ్బరా మాట్లాడ కనే వుంటామా. ప్రెతిదీ అనుమానమే నయిపాయ. యెట్ట యేగేది? మనమేమన్నా నడిబజార్లో అద్దాల వోటలు బెట్టుకోనుండామా, కాలు మింద కాలేసుకుని కూకున్నా జరిగేదానికి! యీ కోలమిట్టలో యిప్పటికే నాలుగు టీ యంగళ్లుండాయిగదా. మనం బెట్టీబెట్టక తాలికే యాపారం యాణ్ణించి జరగతాది? వొక మాట మాట్లాడకుండా, వొక నవ్వు నవ్వకుండా, వొక కులుకు కులకకుండా నేనుగాన గమ్మున పొయ్యి ముందర కూకోనుంటే వొక నా బట్ట అయినా యీ అంగిడి కాడి కొస్తాడా? నేను గూడా ఆ మనిషి మాదిరిగా మొహం కంద గెడ్డాల బెట్టుకోని కూకోనుంటే యాపారం యెప్పుడో యేట్లో గలిసిపొయుణ్ణు. దైర్నంజేసి మొగోడి మాదిర్తో నిలబడబట్టి గదా కడుపుకింత తింటావుండేది. యింత సంసారాన్నీ యీడస్తా వుండేది. అదంతా యోచన జెయ్యాల్నా లేదా?

"ఆ కాడికీ కోపం పట్టలేక వొంగనబెట్టి బాదతానే వుంటివే. యింతలేకే యేం గోరం జరిగిపొయిందనేసి యీ పని జేసింది? రొండు చేతులూ యెత్తకబొయ్యి రైలు కింద బెడ్తివే..."

దు:ఖంతో ఆమె మాటలు తడబడ్డాయి.

"నన్ను సాదించి సంపకదినే దానిగ్గదా యీ పని జేసింది," అని భోరున యేడ్చేసింది. గోడ పక్కకి వంగి బుర్రున ముక్కు చీదింది. బొడ్డులోంచి పైటకొంగు బయటకు లాగి ముక్కూ కళ్లూ తుడుచుకునింది.

"కాలూ ముక్కూ సక్కరంగా వుండే ఆడిది టీ యేస్తా వుండాదనే గదా యీ మొగనాబట్టలంతా యెగ బట్టుకోని యీడదాకా వస్తా వుండేది. వొచ్చిన్నా బట్టలు గొమ్మున టీ తాగేసి బోతారా. ఆ మాటా యీ మాటా మాట్లాడ్తారు గదా! వాళ్లు నాలుగు మాటలు మాట్లాడ్తే నేకొక్క మాటన్నా మాట్లాడాల్నా లేదా? నాకేమన్నా రందిబట్టి వాళ్లతో చెతుర్లాడతా వుండానా? నవ్వతా మాట్లాడిన ప్రెతి నాబట్టకీ నేనేమన్నా కొంగుబరస్తా వుండానా? మానం జంపుకొని గదా బతకతా వుండేది."

మాటలు ఆపి బొడ్లో నుంచి ముక్కుపొడి పొట్లం బయటకు తీసింది. చిటికెడు ముక్కుపొడి తీసుకుని గోడ వైపుకి తిరిగి నోట్లో దోపింది. చూపుడు వేలుతో పళ్లు తోముతున్నట్లుగా పక్క పళ్లకు ముక్కుపొడి రుద్ది చీరకి వేళ్లు తుడుచుకుంటా నావైపు తిరిగింది.

"అబయా... మంచో సెబ్బరో కాయకష్టం జేస్తా వుండా. మరింకేమిటికి మాటలు బడాల. దెబ్బలు తినాల? నేనుగూడా తగ్గడంలా. నన్నొక మాటంటే తిరిగి రొండు మాటలంటా వుండా. వొక దెబ్బ గొడితే తిరిగి వొకటి పీకతా వుండా. యిట్టుండబట్టి గదా ఆ మనిషి అంతమాత్రమన్నా వుండాడు," అనింది విజయమ్మ వాకిటకేసి చూస్తూ.

బయట వెలుగు మందగిస్తూ వుంది. లేచి గూట్లో నుంచి దీపంబుడ్డీ అగ్గిపెట్టి తెచ్చి కింద కూర్చునింది. గోడ వార నుంచి ముగ్గుపిండి డబ్బా ముందుకి లాక్కునింది. బుడ్డీ నుంచి గ్లాసు బయటకుతీసి ముగ్గుపిండి లోపల వేసి తుడిచింది. ముగ్గుపిండి తిరిగి డబ్బాలో పోసి వొత్తి నలిపి వెలిగించి గ్లాసు పెట్టింది.

సంద మసక సాయంత్రాన పసుప్పచ్చటి ఆ దీపపు కాంతి ఆ టీ యంగడి గుడిసె లోపలంతా పరుచుకునింది. యింతదాకా దు:ఖంతో, బాధతో, కోపంతో నిండిన ఆమె ముఖం యిప్పుడా పచ్చటి కాంతిలో తేటగా వుంది.

దీపం వొత్తి కొంచెం పెంచి బుడ్డీని గూట్లో పెట్టి మళ్లీ తన పాత చోటుకి వచ్చి కూర్చునింది.

"యీ మనిషి యిప్పుడీ మాదిరిగా వుండాడు గానీ ఆవరకి యిట్టుండునా... నీకు గెవనం వుండాదో లేదో... అమ్మనడుగు చెబ్తాది. నువ్వప్పుడు యింత పిలగోడివి. అయిస్కూలు బడికి పొయ్యేవోడివి. సందేళ బడొదిలి బెడ్తానే మా యింటికాడ్నే తారకలాడ్తా వుండే వాడివి," అని ఆగి నా ముఖం లోకి చూసింది.

సంతోషకరమైన ఆ జ్ఞాపకాలేవీ మరిచిపోలేద న్నట్టుగా చిరునవ్వుతో తల వూపాను.

"మీ బావని అప్పుడు గదా జూడాల. మిల్లులో పనిజేసే దినాల్లో యెంత మప్పితంగా వుండేవాడనీ! వొక చుట్టాలు పక్కాలు వొచ్చినా, వొకరింటికి బొయినా యెంత మర్యేద! యెవురికే ఆపదొచ్చినా అక్కరగా వుండేవాడు. మా పెళ్లయిన కొత్తల్లో వొకతూరి కాళంగి యేటికి యెల్లవొచ్చింది. వూరు నడిసవుద్రంలో వున్నట్టే గదా! యేపక్క జూసినా నీళ్లే. తోటల మిందంతా యెల్లవ పారతా వుండాది. తోటల్లో యిళ్లు గట్టుకో నుండే వాళ్లు యేమయిపొయినారో అని వూళ్లో అందురూ బయింతో ఆదిక్కే చూస్తా వుండారు. అప్పుడు మున్సీబు, మీ నాయిన, యింకా వూళ్లో పెద్దోళ్లందురూ కలిసి వొక

అయిడీ యేశారు. కాళీ కిరసనాయిలు పీపా లన్నీ దెచ్చి తెప్పగట్నారు. ఆ యెల్లవ యిసురులో తెప్ప మింద బొయ్యి తోటల్లో వుండేవాళ్లని తొడుకోని రావాల. యెల్లవ జోరు జూస్తే బయిమేస్తా వుండాది. అప్పుడీ మనిషి గదా ముందూ యెనకా జూడకుండా యెదురుగెడ బట్టుకోని తెప్పెక్కినాడు. యింకో యిద్దర్ని పిలచకబొయ్యి తోటల్లో పేణాలరి చేతల్లో బెట్టుకోని యిళ్ల మీద కూకోనుండే వాళ్లనంతా యెక్కించుకొని గెట్టున జేర్చాడు. వూరు వూరంతా ఆ దినం యెట్ట జూసిందనీ మీ బావని...''

విజయమ్మ రెండు కళ్లూ రెండు పచ్చటి దీపాలయ్యాయి. ఆమె నావైపు చూసి మాట్లాడుతున్నదే గానీ నన్ను చూడటం లేదు. అపురూపమైన ఆ దృశ్యమంతా నా వెనుక యెక్కడో ఆమెకు కనిపిస్తున్నట్టుగా వుంది. మౌనంగా కొంతసేపు ఆమె దాన్ని ఆస్వాదించింది. వొక దీర్ఘ నిట్టూర్పుతో అందులోనుంచి బయటకు వచ్చింది.

"అబయా... మిల్లు పని యేమనంటా పొయిందో గానీ ఆ కాణ్ణించేగదా యీ మనిషికి సెని జుట్టుకోనుండేది. సోమయ్య పనిలో మొనగాడంటిరి. మిల్లులో యే మిషినీకి యే రిపోరొచ్చినా యే రేత్రయినా పరుగుల మింద పొయ్యి పని జేస్తావుణ్ణె, అట్లాంటోడిని కనికరమన్నా లేకుండా పన్లో నుంచి తీసేస్తిరే... వాళ్లు నాసినమయిపోను. అక్కణ్ణించే గదా మనిషి మనిషిలో లేకుండా బొయినాడు. యింకన బతకాల గదా అన్జెప్పి కూలీనాలీ జేసె. కులంగాని పనని అనుకోకుండా దేవాంగుల్తో సమానంగా మొగ్గం నేసె. బాగుపడ్డాం గదా అనకుంటా వుండేలోకే ఆ అమర్జోతి సొతు... దాన్నోట్లో మట్టిబడా... నిండా ముంచేసి బొయినే... యెంతకని తట్టుకునేది. యీ బాదలకి తాళలేక తాగుడుకి తగులుకునేసినాడు. తాగుడుతోపాట్నే వూళ్లో పొరికి నాబట్టల సావాసాలు మరిగినాడు. యింకన బాగుబడేదేడ? మొగ్గంపని బొయినాక మట్టిపనికి బోతే నడుములిరిగిపాయ. వొళ్లు దాపెట్టుకోకుండా కష్టంజేస్తే మటుకు యేం సుకం... బతకలేకనే పాయనే. యెంత మనిషి కన్నా యింక మతిజెడకుండా వుంటాదా? అందాకా నన్ను యెంగటగిరి మకారాణి మాదిర్తో ముదిగారంగా జూసుకునే మనిషే యీ వాటంగా మారిపొయినాడంటే ఆ తప్పు యీ మనిషిదా, యీ మనిషి బడ్డ కష్టాలదా?''

పిడుగులాంటి ప్రశ్నవేసి కొన్ని క్షణాలు మౌనంగా వుండిపోయింది. నా నుంచి యే సమాధానం కోసమూ యెదురు చూడకుండానే తిరిగి కొనసాగించింది.

"మైండు నిండా చెడిపొయ్యి గదా యీ మనిషి యీ మాదిర్తో ఆటలాడతావుండేది. యిప్పుడా మనిషిని తప్పుబట్టి యేం పలం? యింకనిపుడు ఆ మనిషి మానాన ఆ మనిషిని వొదిలేసి నా దారి నేను జూసుకుంటే న్యాయంగా వుణ్ణా! రెక్కలు రాని బిడ్డల్ని కోడిపెట్ట రెక్కల కింద పొదుక్కున్నేగానీ వొదిలేసి దాని తిండి అది యెతుక్కుంటాబోతాదా? చేతుల్లేని యీ మనిషి పసిబిడ్డతో సమానం గదా.''

వొక్క క్షణం ఆగి, "అవునంటావా, కాదంటావా,'' అని అడిగింది.

ఆమె మాటల ధాటికి దిమ్మెరపోయి యే సమాధానమూ చెప్పకుండా ఆమెనే చూస్తున్నాను. నా పరిస్థితిని అర్థం చేసుకున్నట్టుగా ఆమె అనింది.

"చిన్నబయా... యింతజేసినా ఆ మనిషిని జూస్తే బాద కలుగునేగానీ కోపం రాకపాయ. దినమ్మూ తిట్టేది. తన్నేది. మల్ల కొంచేపిటికి 'యిజియా' అంటా కావులించుకొని బొరోమని పసిబిడ్డాల యేడ్చేసేది. పిచ్చెదవ.''

ఆమె కళ్లనిండా తడి. ఆమె గొంతునిండా అతని పట్ల అవ్యాజమైన అనురాగం తొణికిసలాడాయి.

*ఆంధ్రజ్యోతి వారపత్రిక దీపావళి ప్రత్యేక సంచిక, 1997*